క్లుప్తంగా



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న పోలీస్ సిబ్బంది

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

మోకిల సీఐ వీరబాబు

శంకర్‌పల్లి: ఉచిత వైద్య శిబిరాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మోకిల సీఐ వీరబాబు పేర్కొన్నారు. శుక్రవారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా మోకిల పోలీస్ స్టేషన్లో హోలిస్టిక్ ఆసుపత్రి ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. ఎస్ఐ కోటేశ్వర్ రావు,పాల్గొన్నారు.

గ్రంథాలయాలతో విజ్ఞానం పెంపొందుతుంది

ఎన్కెపల్లి సర్పంచ్ చందన



లైబ్రరీ భవనాన్ని ప్రారంభిస్తున్న చందన

మొయినాబాద్ రూరల్: గ్రంథాలయాలతో విజ్ఞానం పెంపొందుతుందని ఎన్కెపల్లి సర్పంచ్ చందన పేర్కొన్నారు. ఎన్కెపల్లి గ్రామంలో గ్రామ పంచాయతీ నిధులతో నిర్మించిన నూతన గ్రంథాలయం, బస్టాండ్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లైబ్రరీ ఏర్పాటుతో ప్రజలందరికీ పాఠ్య పుస్తకాలతో పాటు ప్రతీరోజు వార్తాపత్రికలు చదవడానికి అవకాశం ఉంటుందన్నారు. గ్రామంలో గ్రంథాలయ ఏర్పాటుతో లైబ్రరీ లేని కొరత తీర్చామన్నారు. నూతన గ్రంథాలయ ఏర్పాటుతో గ్రామ ప్రజలు ఎంతో సంతోషం వ్యక్తం చేశారన్నారు. విద్యావంతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ జెల్లాల వెంకటమ్మ, వార్డు సభ్యులు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎంఈఓ అక్బర్

చేవెళ్ల: ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని మండల విద్యాధికారి అక్బర్ పేర్కొన్నారు. చేవెళ్ల మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ మండలశాఖ క్యాలెండర్‌ను ఎంఈఓ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి డీఏ, పీఆర్సీ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి, నాణ్యమైన విద్య బోధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టీఎఫ్ ఉపాధ్యాయ సంఘం నాయకులు అరుణ్‌కుమార్, శ్రీనివాస్, ఉపాధ్యాయులు మోహరున్నీసాబేగం, రజిత, అనసూయ, రాజు, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారం మరువలేనిది



స్పోర్ట్స్ కిట్స్‌ను అందిస్తున్న దాతలు, సర్పంచ్ అరుంధతి, ఎంపీటీసీ రవీందర్

చేవెళ్ల: దాతల సహకారం మరువలేనిదని ప్రధానోపాధ్యాయులు ఎండీ మునీర్ పాషా పేర్కొన్నారు. శుక్రవారం గణతంత్ర దినోత్సవంలో భాగంగా కందవాడ, ఎన్కేపల్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు దాతలు స్పోర్ట్స్ కిట్స్, పేట్లు, ప్యాడ్‌లు, స్కూల్ బ్యాగులు, ప్రదానం చేశారు. హైదరాబాద్‌కు చెందిన కృష్ణకాంత్ అతని స్నేహితులు సంజయ్‌లు స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ పేద విద్యార్థులను ప్రతిఒక్కరూ ఆదుకోవాలన్నారు. గ్రామానికి చెందిన మల్లేశ్ పాఠశాలలో సైన్స్‌ల్యాబ్ ఏర్పాటునకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. పాఠశాలలో నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. సర్పంచ్ అరుంధతిసాయిరెడ్డి, ఎంపీటీసీ రవీందర్, బల్వంత్‌రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఎర్ర మల్లేశ్, పాల్గొన్నారు.

జెండాకు వందనం

నియోజకవర్గాల్లో వాడవాడలా శుక్రవారం గణతంత్ర దినోత్సవ వేడుకలు జరుపుకున్నారు. చేవెళ్ల, షాద్‌నగర్‌లో ఎమ్మెల్యేలు క్యాంపు ఆఫీసులపై, ఆర్డీఓ కార్యాలయంపై సాయిరాం, డివిజనల్ పోలీసు కార్యాలయంపై ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి, మార్కెట్ కార్యాలయంపై చైర్మన్ మిట్ట వెంకటరంగారెడ్డి, ఎంపీడీఓ, పంచాయతీ రాజ్, గ్రామీణ నీటి సరఫరా విభాగం, వ్యవసాయ డివిజన్ కార్యాలయం, బ్యాంకులపై, తహసీల్దార్ కార్యాలయాలు, ఎంపీడీఓ కార్యాలయాలు, గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ఆయా శాఖల ఉన్నతాధికారులు జెండా ఆవిష్కరించారు. అధికారులు, రాజకీయ నాయకులు జెండా వందనంలో పాల్గొన్నారు. ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు జాతీయ జెండా ఎగురవేశారు.



చేవెళ్ల: క్యాంపు కార్యాలయం వద్ద జెండా వందనం చేస్తున్న ఎమ్మెల్యే కాలెయాదయ్య



షాబాద్ పోలీస్‌స్టేషన్లో జెండా ఎగుర వేస్తున్న సీఐ యాదయ్యగౌడ్



చేవెళ్ల: తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ కృష్ణయ్య, ఎమ్మెల్యే కాలెయాదయ్య



కొందుర్గు: తహసీల్దార్ కార్యాలయం వద్ద జెండా వందనం చేస్తున్న అధికారులు



శంకర్‌పల్లి: మున్సిపల్ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరించిన చైర్‌పర్సన్ సాత విజయలక్ష్మి



షాబాద్: మండల పరిషత్తు కార్యాలయంపై ఎంపీపీ కోట్ల ప్రశాంతిరెడ్డి



చేవెళ్ల: పట్నం మహేందర్‌రెడ్డి మెడికల్ అండ్ జనరల్ ఆసుపత్రిలో జెండా వందనంలో ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి



మొయినాబాద్ రూరల్: జాతీయ గీతం ఆలపిస్తున్న ఎంపీడీఓ సంధ్య, ఎంపీపీ నక్షత్రంజేవంతు



మొయినాబాద్ రైతు వేదిక వద్ద జాతీయ జెండా ఎగురవేసిన ఏఓ రాగమ్మ



నందిగామ: జెండా ఎగురవేస్తున్న తహసీల్దార్ అయ్యప్ప



కేశంపేట: తహసీల్దార్ కార్యాలయంలో అజింఅలీ, ఎంపీపీ రవీందర్ యాదవ్, ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి



షాద్‌నగర్ రూరల్: క్యాంపు కార్యాలయంలో జెండా వందనం చేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



మొయినాబాద్ రూరల్: కేఎల్ యూనివర్సిటీలో ఎన్‌సీసీ విద్యార్థులతో ప్రిన్సిపాల్ రామకృష్ణ



షాద్‌నగర్ రూరల్: కమ్మదనం గురుకుల పాఠశాలలో విద్యార్థినుల నృత్య ప్రదర్శన

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

మొయినాబాద్: మండలంలోని సబ్‌స్టేషన్ పరిధిలోని అజీజ్‌నగర్, నాగిరెడ్డిగూడ గ్రామాల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా ఉండదని మండల విద్యుత్ ఏఈ బానోతు హమునాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ల కింద ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు కారణంతో అజీజ్‌నగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, నాగిరెడ్డిగూడ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 12.30 గంటల నుంచి 2.30 గంటల వరకు, శ్రీనిధి-2 ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. ఈ విషయంలో రైతులు, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

షాద్‌నగర్‌లో.. షాద్‌నగర్: పట్టణంలోని శుభం ఫీడర్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఫీడర్ పరిధిలో చెట్ల తొలగింపు కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు విద్యుత్ శాఖ పట్టణ ఏఈ వినోద్ తెలిపారు.

న్యూసిటీ కాలనీ, భగీరథ, మల్లికార్జున, ప్యారడైజ్, విద్యుత్, ఆదర్శ కాలనీల్లో ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఫీడర్ పరిధిలోని ఆఫీసర్స్ కాలనీ, రాఘవేంద్ర కాలనీ, రిజిస్ట్రేషన్ కార్యాలయం, భాగ్యనగర్ కాలనీల్లో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్ర 5 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ విషయంలో సహకరించాలని ఏఈ కోరారు.

ఉత్తమ సేవలకు పురస్కారాల ప్రదానం



షాద్‌నగర్: ప్రశంసా పత్రం అందుకుంటున్న షాద్‌నగర్ ఆర్డీఓ వెంకటమాధవరావు



షాద్‌నగర్: ప్రశంసా పత్రం అందుకుంటున్న సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి

చేవెళ్ల/షాద్‌నగర్: ఉత్తమ సేవలు అందిస్తున్న వివిధ శాఖ అధికారులకు గణతంత్ర్య దినోత్సవం సందర్భంగా కలెక్టర్ శశాంక పురస్కారాలు అందజేశారు. రెవెన్యూ విభాగంలో ఆర్డీఓ వెంకట మాదవరావు, వైద్య విభాగంలో ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, చించోడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ స్రవంతి, ఉత్తమ హెల్త్ ఎడ్యుకేటర్‌గా జె.శ్రీనివాసులు, ఉత్తమ ఆశా వర్కర్‌గా కొందుర్గు మండలం గుర్రంపల్లి సబ్‌సెంటర్‌లో పని చేస్తున్న రాములమ్మ ఎంపికయ్యారు. మహిళా సంఘాలకు బ్యాంకు రుణాల లింకేజీ లక్ష్యం పూర్తి చేసినందుకుగాను ఫరూఖ్‌నగర్ ఏపీఎం నగేష్ ఉత్తమ అధికారిగా అవార్డులు అందుకున్నారు.

ఉత్తమ ఉద్యోగి అవార్డుకు పంచాయతీరాజ్ ఏఈ ప్రశాంత్‌రెడ్డి..



చేవెళ్ల: అవార్డు అందుకుంటున్న ప్రశాంత్‌రెడ్డి

చేవెళ్ల మండలంలో పంచాయతీరాజ్ ఏఈ ప్రశాంత్ రెడ్డి ఉత్తమ ఉద్యోగిగా ప్రశంసాపత్రం అందుకున్నారు. ఈ అవార్డుతో మరింత బాధ్యత పెరిగిందని ఆయన చెప్పారు.

జక్కని బందయ్యకు డాక్టరేట్ అందజేత

షాబాద్: ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న జక్కని బందయ్యకు డాక్టరేట్ ప్రదానం చేశారు. శుక్రవారం హోలీస్పిరిట్ క్రిస్టియన్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో నగరంలోని సికింద్రాబాద్‌లో నిర్వహించిన 2024 సౌత్ ఇండియా కాన్వకేషన్‌లో భాగంగా డాక్టర్ ఆఫ్ ఎడ్యుకేషన్ విభాగంలో ఆయనకు ప్రదానం చేశారు. ప్రస్తుతం మొయినాబాద్ మండల పరిధిలోని చందానగర్ ప్రభుత్వ పాఠశాలలో సాంఘీక శాస్త్రం ఉపాధ్యాయుడిగా ఆయన పనిచేస్తున్నారు.

హోలీస్పిరిట్ క్రిస్టియన్ యూనివర్సిటీలో ఆయన 'భారతీయ విద్యా వ్యవస్థ, సమాజంపై కులం ప్రభావం, అంబేడ్కర్ కలలుగన్న కులరహిత సమాజాన్ని నిర్మించడంలో సాధ్య-అసాధ్యాలు' అనే అంశంపై ఉప కులపతి బిషప్ ఆనంద్‌కుమార్ పర్యవేణలో పరిశోధన పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఆయనకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు ఉప కులపతి తెలిపారు.



బోనాలకు ముస్తాబైన ఎన్కెపల్లి గ్రామం

రేపటి నుంచి ఎన్కెపల్లిలో బోనాలు

మొయినాబాద్ రూరల్: రెండు సంవత్సరాలకొకసారి చేసుకొనే పోచమ్మ, మైసమ్మ బోనాలు ఎన్కెపల్లి గ్రామంలో ఆదివారం నుంచి రెండు రోజుల పాటు ఘనంగా నిర్వహించనున్నట్లు సర్పంచ్ చందనచంద్రయ్య తెలిపారు. ఎన్కెపల్లి గ్రామంలో ఆదివారం పోచమ్మ బోనాలు, సోమవారం మైసమ్మ బోనాలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఈ బోనాలకు జంట నగరాలతో పాటు ఆయా జిల్లాలు, ప్రాంతాల నుంచి బంధుమిత్రులు, స్నేహితులు పాల్గొననున్నారని ఆయన తెలిపారు.



మాట్లాడుతున్న టీఎస్‌యూటీఎఫ్ నాయకులు

విద్యా వ్యవస్థలో సమస్యలు పరిష్కరించాలి

టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటప్ప

చేవెళ్ల: విద్యావ్యవస్థలోని సమస్యల పరిష్కారానికి ఉపాధ్యాయ సంఘాలు కృషి చేయాల్సిన అవసరం ఉందని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. వెంకటప్ప, కార్యదర్శి ఎన్. నర్సింలు, జిల్లా కమిటీ సభ్యులు అక్బర్‌లు పేర్కొన్నారు. చేవెళ్లలో శుక్రవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ టీఎస్‌యూటీఎఫ్ జిల్లా విస్తృత కార్యవర్గ సమావేశం ఆదివారం చేవెళ్లలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశానికి జిల్లాలోని నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. దీనికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు దుర్గాభవానీ, రాష్ట్ర కార్యదర్శి గాలయ్య, ప్రజాప్రతినిధులు ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచ్‌లు, ఎంఈఓలు హాజరవుతారని చెప్పారు. ఈ సమావేశంలో విద్యారంగా అంశాలపై చర్చించి ప్రభుత్వానికి సమస్యల పరిష్కారానికై ప్రతిపాదన చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో చేవెళ్ల మండల అధ్యక్షుడు ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన గుర్రంపల్లి ఉర్సు ఉత్సవాలు

ఎమ్మెల్యే ప్రత్యేక ప్రార్థనలు



గుర్రంపీర్ల వద్ద ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొందుర్గు: కొందుర్గు మండలం గుర్రంపల్లి ఉర్సు ఉత్సవాలు శుక్రవారం ప్రారంభ మయ్యాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హాజరై గుర్రంపీర్లకు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గంధాలంకరణ నిర్వహించి, చాదర్ కప్పారు. అనంతరం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ గుర్రంపల్లికి ఎంతో ప్రాధాన్యత ఉందని, పసిపిల్లలకు ఎలాంటి హితిబాధలు వచ్చినా ఈ గుర్రం చట్టు ప్రదక్షిణ చేయిస్తే హితిబాధలు తొలగిపోతాయని భక్తుల నమ్మకమన్నారు. పూర్వకాలం నుంచి ఈ గుర్రం పీర్లను దేవుడిగా కొలవడం అనవాయితీగా వస్తుందన్నారు. ఈ ఉత్సవాలను కుల, మతాలకతీతంగా జరుపుకోవడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల కమిటీ అధ్యక్షుడు కావలి రాజు, ఆంజనేయులు, చంద్రశేఖర్, యాదగిరి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

యువత అన్ని రంగాల్లో ముందుండాలి

అమ్డాపూర్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రేణుక



భరత్‌కుమార్‌ను సన్మానిస్తున్న ప్రధానోపాధ్యాయురాలు రేణుక

మొయినాబాద్‌రూరల్: యువత అన్ని రంగాల్లో ముందుండాలని అమ్డాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రేణుక అన్నారు. శుక్రవారం అమ్డాపూర్ పాఠశాలలో మౌలిక వసతులు, మహనీయుల ఫొటోలు ప్రదానం చేసిన పోలీసు ఉద్యోగి భరత్‌కుమార్‌ను అభినందిస్తు పాఠశాల ఆవరణలో సన్మానించారు. ఈ సందర్భంగా రేణుక మాట్లాడుతూ యువత సమాజ సేవలో పాలు పంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ రవీందర్‌రెడ్డి, ఉపసర్పంచ్ నాగార్జునచారి, విశ్వకర్మ జిల్లా సంఘం నాయకులు నర్సింహ్మాచారి, గోపికృష్ణారెడ్డి, జైపాల్‌రెడ్డి, ప్రకాష్‌గౌడ్, విక్రమ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు బాగా చదవాలి

వరల్డ్ ఉమెన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ జాతీయ అధ్యక్షుడు జాకీష్రాఫ్



మెడల్స్, సర్టిఫికేట్స్ అందస్తున్న జాకీష్రాఫ్, పామెన నర్సింహులు, సర్పంచ్ ఇస్మత్‌బేగం

షాబాద్: విద్యార్థులు బాగా చదివి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకువాలని వరల్డ్ ఉమెన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ జాతీయ అధ్యక్షుడు జాకీష్రాఫ్ పేర్కొన్నారు. శుక్రవారం పోతుగల్ ఉన్నత పాఠశాలలో గణతంత్రదినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాలల్లో బాగా చదివే విద్యార్థులకు మెంబర్ పామెన నర్సింహులుతో కలిసి మెడల్స్, సర్టిఫికేట్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సరం పదోతరగతిలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు రూ.10వేలు అందజేస్తామన్నారు. విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివి తల్లిదండ్రుల కలలను నిజం చేయాలని సూచించారు. దేశ భవిష్యత్ విద్యార్థుల చేతుల్లోనే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఇస్మత్‌బేగం, మాజీ కో-ఆప్షన్ సభ్యులు సయ్యద్ అయూబ్, పాఠశాల ఉపాధ్యాయులు, నాయకులు దయనంద్‌గౌడ్, కృష్ణ పాల్గొన్నారు.

శివాజీ యూత్ అధ్యక్షుడిగా యాదగిరి

కొందుర్గు: కొందుర్గు మండల కేంద్రానికి సంబంధించి ఛత్రపతి శివాజీ యూత్ నూతన కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మొద్దు యాదగిరి, ఉపాధ్యక్షుడిగా శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శులుగా శేఖర్, హరీశ్, కోశాధికారిగా వినోద్, కార్యదర్శులుగా శ్రీకాంత్, వంశీ, రవికిశోర్, మల్లేశ్, ప్రశాంత్ ఎన్నికయ్యారు.